
www.prajasakti.com
ప్రజాశక్తి
5
సోమవారం 4 మార్చి 2024



తిరుపతి

నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నంద్యాలకు చెందిన ఎల్.ప్రసాద్ అనే వ్యాపారి ఆదివారం 12 టన్నుల కూరగాయలు వితరణగా ఇచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు వీటిని స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అక్రమాలను అడ్డుకునందుకే ఆమె బదిలీ..?

ప్రజాశక్తి- తిరుపతిసిటీ

అధికార పార్టీ అక్రమాలను అడ్డుకునేందుకు పూనుకోవడమే ఆమె చేసిన తప్పు. అంతే బాధ్యతలు చేపట్టి పుట్టమని పాతిక రోజులు కూడా కాలేదు, బదిలీ ఆర్డర్లు జారీ అయ్యాయి అంటే అవుననే చెబుతున్నాయి విశ్వాసనీయ వర్గాలు. ఆమె క్రమశిక్షణకు మారుపేరు, వివాదరహితంగా ఉంటారని గతంలో ఆయన పని చేసిన చోట పేరు తెచ్చుకున్నారు. బాధ్యతలు తీసుకున్న పాతిక రోజుల్లోనే ఏకై వచ్చి మేకులా కూర్చుందని అధికార పార్టీ పెద్దలు భావించారు. అంతే హుటా హుటిన బదిలీ ఆదేశాలు సిద్ధం చేశారు. ఆమె ఎవరో కాదు ఓ ఐపిఎస్ ఆఫీసర్, తిరుపతి జిల్లా ప్రస్తుత ఎస్పీ మల్లిక గార్గ్.

ఆమె స్వస్థలం ఢిల్లీ. 2015 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె, పశ్చిమ బెంగాల్ క్యాడర్‌గా నియమితులయ్యారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని చందన్‌నగర్, సిరాంపూర్ ఏసిపిగా, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) డిప్యూటీ కమాండర్‌గా పనిచేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఐపిఎస్ కేడర్ అధికారిగా బదిలీ అయ్యారు. రాష్ట్రంలో ఒంగోలు జిల్లా ఎస్పీగా తొలిసారి బాధ్యత నిర్వహించారు. అక్కడి నుంచి ఆమె సాధారణ బదిలీలో భాగంగా 2024 ఫిబ్రవరి 12వ తేదీ తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఆమె బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జిల్లాలో విస్తృత పర్యటన చేపట్టారు. పలు పోలీస్‌స్టేషన్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న వారిపై చర్యలు చేపట్టారు. రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు, పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. ఇటీవల జరిగిన తిరుమలలో రథసప్తమి వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. అయినా ఆమె బాధ్యతలు చేపట్టి కనీసం నెల కూడా గడవకనే బదిలీ అవ్వాల్సి వచ్చింది. అన్ని బాగానే ఉన్నాయి, కానీ అధికారం పార్టీ పెద్దలు తలిచింది వేరే, అందుకే ఆమె బదిలీ అవ్వాల్సి వచ్చింది. తిరుపతి జిల్లాలో నకిలీ ఓట్లు ఘటన, చిలికి చిలికి గాలీ వానగా మారింది. ఇప్పటికే కలెక్టర్ స్థాయి వ్యక్తి, డిప్యూటీ కమిషనర్, నలుగురు సిఐలు, ఎస్ఐ, ఏఎస్ఐ సస్పెండ్‌కు గురయ్యారు. మరికొందరిపై చర్యలు తప్పవు అనుకున్న సమయంలో ఆమె తిరుపతి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. నకిలీ ఓట్లు వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి పెట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు చేపట్టారు. ఆమె మొత్తం ఎన్నికల నిబంధనలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని భావించారు. ఆ దిశగానే తన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కానీ అధికార పెద్దలు తలచింది వేరే. గతంలో జరిగిన నకిలీ ఓట్ల వ్యవహారాన్ని పక్కనపెట్టి, రాబోవు ఎన్నికల్లో అధికార పార్టీకి అండగా ఉండేలా చూడాలని పెద్దలు భావించారు. ఆమె స్పీడ్ తగ్గించుకోవాలని సూచించారు, ఒత్తిడి తీవ్రతరం చేశారు. ఎన్నికల సమయంలో తాము సిఫారసు చేయాల్సి వస్తే పనులు జరగవని భావించారు. అంతే పట్టుమని పాతిక రోజులు కూడా గడవక ముందే ఆమెను, ఎన్నికల నిర్వహణకు పెద్దగా ఆటంకం లేని సిఐడి విభాగానికి బదిలీ చేశారని, ప్రతిపక్షాలు, న్యాయ నిపుణులు, బహిరంగగానే విమర్శిస్తుండడం గమనార్హం.



బదిలీపై వెళుతున్న ఎస్‌పి మల్లిక గార్గ్, తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్

తిరుపతి జిల్లా ఎస్‌పి మల్లిక గార్గ్ బదిలీ

నూతన ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్

తిరపతి జిల్లా ఎస్పీ మల్లిక గార్గ్ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో జిల్లా నూతన ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న మల్లికా గార్గ్‌ను సిఐడి ఎస్పీగా, విజయవాడ డిసిపిగా కృష్ణకాంత్ పటేల్‌ను తిరుపతి ఎస్పీగా బదిలీ చేశారు. ఈ మేరకు ఒకటి రెండు రోజుల్లో వారు బదిలీ అయిన ప్రాంతాల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం. ఇటీవల తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న మల్లికా గార్గ్ నెల రోజులు కూడా గడవకముందే బదిలీ కావడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ ఆగడాలకు అంతులేదంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

శివుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నేడు ముక్కంటి ధ్వజారోహణం

సోమవారం దేవరాత్రి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తాగ్రేసురుడైన భక్తకన్నప్పకు తొలిపూజతో భవుని బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. పరమశివునికి అత్యంత ప్రీతి పాత్రుడైన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ముక్కంటి ఆలయంలో భక్త కన్నప్ప ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేశారు. స్వామి వారిని సర్వాలంకారణ భూషితుణి చేశారు. ఈ అలంకరణలో భక్తకన్నప్ప దేదీప్యమానమై వెలిగి పోయారు. అలంకరణ పూర్తి చేసిన తరువాత ఆలయ పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల తరువాత భక్తకన్నప్ప ఉత్సవమూర్తిని మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య భక్త కన్నప్ప కొండపైకి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న ఆలయంలో ఉత్సవమూర్తిని ఉంచారు. ఆలయంలో స్వామి వారికి పూజలు చేశారు. ఆ తరువాత భక్తకన్నప్ప ఆలయానికి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభానికి కొడిని ఎగురవేసి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలు తిలకించడానికి వందలాది మంది భక్తులు భక్తకన్నప్ప కొండపైకి తరలి వచ్చారు. ధ్వజారోహణం వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్‌డిఓ రవిశంకర్ రెడ్డి, పలువురు ప్రముఖులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు ముక్కంటి ధ్వజారోహణం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మధ్యాహ్నం 12.30గంటల నుంచి శ్రీకాళహస్తీశ్వరస్వామి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ముక్కంటి ఆలయంలో స్వామి వారి ఆలయానికి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్ద ఈ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం వెండి అంబారీ వాహనసేవ చేయనున్నారు.



పంచమూర్తులు చతుర్మాడ వీధుల్లో విహరిస్తారు. ఇక రాత్రి 8గంటలకు శ్రీకాళహస్తీశ్వరస్వామి వెండి అంబారీ పైన జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరంపై పురవిహారం చేయనున్నారు.

నేడు దేవరాత్రి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రాత్రిని దేవరాత్రి అంటారు. త్రిపురాసురుని సంహరించడానికి సముద్రంలో అమృత మథనం కోసం దేవతలందరూ సమావేశమై తమను త్రిపురాసురుని బాధ నుంచి కాపాడేది ఒక్క కైలాసనాథుడే అని చర్చించుకోవడాన్ని దేవరాత్రి అంటారు. దేవరాత్రి రోజు స్వామి వారు వెండిపల్లకిలో దర్శనమిస్తారు.

సుండుపల్లి కిరణ్మయికి ఎస్వీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్



ఎస్వీయూ రసాయనశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని సుండుపల్లి కిరణ్మయికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్ర విభాగం ఆచార్యులు, ఎస్వీయూ పూర్వపు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు ఆచార్య జి.మాధవి మార్గదర్శకత్వంలో 'ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ఎలక్ట్రోకెమికల్ సెన్సార్ ఫర్ బయో మెడికల్ అప్లికేషన్స్' అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. కిరణ్మయి పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్‌లో అనేక పరిశోధనాపత్రాలను ప్రచురించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా సదస్సులలో పాల్గొని అనేక పరిశోధనా పత్రాలను సమర్పించినట్లు వివరించారు. సుండుపల్లి కిరణ్మయికి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ పై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఈఆర్ఓ అదితి సింగ్ పరిధిలోని ఏఈఆర్ఓలు, సెక్టరల్ అధికారులు, బిఎల్ఓలతో ఆదివారం సమావేశమయ్యారు. అలాగే తిరుపతి రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో చంద్రగిరి ఈఆర్ఓ నిషాంత్ రెడ్డి ఆ నియోజకవర్గ పరిధిలోని ఏఈఆర్ఓలు, సెక్టరల్ అధికారులు, బిఎల్ఓలతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బియోండ్ ఎస్-ఎల్ఏలో ఉన్న క్లెయిమ్స్, అబ్జెక్షన్, పెండింగ్ అంశాలపై సమీక్షిస్తూ రేపటి లోపు ఎట్టి పరిస్థితిలోనూ పరిష్కరించాలని ఆదేవించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓలు వెరిఫై చేసి అనుమతించిన, రిజెక్ట్ చేసిన క్లెయిమ్స్, అబ్జెక్షన్లను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశా మాట్లాడుతూ బిఎల్ఓలు వారి పరిధిలోని వలసపోయిన వారిని, మరణించిన వారి వివరాలు ఓటరు జాబితాలో ఉంటే వాటిని సుమోటాగా తొలగించరాదని, పకడ్బందీగా ధ్రువపత్రాలు మేరకు మాత్రమే చేయాలన్నారు. సంబధిత రికార్డు పత్రాలను భద్రపరచాలని సూచించారు. సెక్టరల్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పపై మరోసారి సరిచూసుకోవాలని తెలిపారు. అధికారులందరూ ఎన్నికల విధుల్లో బాధ్యతగా పనిచేసి ఎలాంటి చిన్నపొరపాటుకు తావు ఇవ్వకూడదని ఆదేశించారు. బిఎల్‌వోలు, ఈవిఎంపై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ కలింగి ఉండి ఎన్నికల బాధ్యతల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఈఆర్ఓలు, సెక్టరల్ అధికారులు, ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభూమి సేవకే వచ్చాం...

డాక్టర్ గౌరీనేని ప్రసాద్

అమరాలో వార్షికోత్సవ సంబరాలు

ప్రజాశక్తి- రేణిగుంట: అమెరికా నుంచి తమ మాతృభూమి సేవకు, రాష్ట్రప్రజలకు సేవ చేయడానికి అమర హాస్పిటల్ నెలకొల్పామని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గౌరీనేని ప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం రేణిగుంట మండలంలోని కరకంబాడీ సమీపంలో గల అమర ఆసుపత్రిలో మూడవ వార్షికోత్సవ సంబరాలను వైభవంగా నిర్వహించారు. చిన్నపిల్లలు నృత్యాలతో అలరించి బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌరీనేని ప్రసాద్ మాట్లాడుతూ తమ ప్రాంత ప్రజలకు సేవ చేయడానికి అమర హాస్పిటల్ ను స్థాపించామన్నారు. అత్యాధునిక పరికరాల ద్వారా అమర ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. అందరి మధ్య అమర హాస్పిటల్ వార్షికోత్సవ సంబరాల జరుపుకోవడం కనుల పండగ ఉందన్నారు. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ డాక్టర్ గౌరినేని ప్రసాద్ అమెరికాలో పేరు ప్రఖ్యాతలున్న డాక్టర్ అని కొనియాడారు. మన రాష్ట్రంలో ప్రజలకు సేవ చేయాలని సంకల్పంతో హాస్పిటల్‌ను నిర్మించాలని తనను కోరినట్లు తెలిపారు. తమ కుటుంబ సభ్యుల మధ్య అమర ఆసుపత్రి మూడవ వార్షికోత్సవ సంబరాల జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ గౌరినేని రమాదేవి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో అమర ఆసుపత్రిని నిర్మించామన్నారు. ఈ మూడు సంవత్సరాల్లో ఎన్నో సవాళ్లు అధిగమించి విజయం సాధించామన్నారు. గల్లా అరుణకుమారి మాట్లాడుతూ అమర ఆసుపత్రిలో అద్భుతమైన చికిత్సలను డాక్టర్లు అందిస్తున్నారని తెలిపారు. జిజీఎం శ్రీధర్, సీఓఓ డాక్టర్ మధు సూధన్‌రావు, డాక్టర్ వరుణ్, డాక్టర్ రవికుమార్ రెడ్డి, డాక్టర్ దుర్గ ప్రసాద్, డాక్టర్ హర్షిత రెడ్డి, డాక్టర్ వెంకట కృష్ణ, అమర ఆసుపత్రి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వేణుగోపాల్, పిఆర్ఓ మునినాదం, అమర ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు నేతలు డిమాండ్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుమలలో ఆరోగ్య విభాగంలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆదివారం స్థానిక యశోదనగర్‌లోని సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.సుబ్రమణ్యం, సిఐటియు నగర ప్రధానకార్యదర్శి కే.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న 300 మందిని కార్మికులను అకారణంగా తొలగించడం అన్యాయమన్నారు. కొత్తగా టెండర్ తగ్గించుకున్న డస్టర్ కంపెనీ, పిఎన్ఎస్ కంపెనీ, చైతన్య జ్యోతి కంపెనీలు గతంలో పనిచేస్తున్న కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకారణంగా కార్మికుల కడుపులు కొట్టడం మంచిది కాదన్నారు. ఈ పనిపై ఆధారపడి బతుకుతున్న దళిత, బడుగు, బలహీనవర్గాల కార్మికులను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. కార్మికులకు జరిగిన అన్యాయంపై లేబర్ కోర్టులో ఫిర్యాదు చేస్తామని, టీటీడీ పరిపాలన భవనం వద్ద ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కొంతమంది దౌర్జన్యంగా, ఇష్టానుసారంగా, తమదే పెత్తనం అనే ధోరణితో వ్యవహరించడం మంచిది కాదన్నారు. తమ మాట వినని కార్మికులను తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి జోక్యం చేసుకొని తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిఐటియు నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు ఎం.మాధవ్, ఏ.రాధాకృష్ణ, పి.రమేష్ బాబు, తంజావూరు మురళి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.రఘు, సిద్దు, ప్రభాకర్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

వేమన విజ్ఞాన కేంద్రంలో

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్

స్థానిక యశోదనగర్‌లోని ఎంబి భవన్‌లో వేమన విజ్ఞాన కేంద్రం, ప్రజాఆరోగ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరానికి సంకల్ప, కృష్ణతేజ డెంటల్ కాలేజీ, ఆసుపత్రి వైద్యులు రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి ఎం.నాగార్జున మాట్లాడుతూ పేదప్రజలు వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారని, అలాంటి వారికి కోసం వేమన విజ్ఞాన కేంద్రం, ప్రజారోగ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రోగులకు బీపీ, షుగర్, చర్మవ్యాధులు, న్యూరాలజీ, దంత సమస్యలు, మహిళలకు సంబంధించిన వైద్యనిపుణులచే ఉచితంగా పరీక్షలు నిర్వహించి వైద్యం అందించడం జరిగిందన్నారు. వైద్యులు సూచించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇలాంటి వైద్య శిబిరాలు వేమన విజ్ఞానం కేంద్రం ఆధ్వర్యంలో మరిన్ని నిర్వహించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం వల్ల నిరుపేద ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. విజ్ఞాన కేంద్రం సభ్యులు డాక్టర్ జాలేశ్వరరావు, ఓ. వెంకటరమణ, మునిలక్ష్మీ, తహసున్నిషా, హేమలత, కుప్పస్వామి, ప్రజారోగ్య పరిరక్షణ కమిటి నాయకులు బాలకృష్ణ, ముఖేష్, కిరణ్, రాజేష్, శ్రీనివాస్, నాగరాజ, సంకల్ప ఆసుపత్రి డాక్టర్ వాణిరెడ్డి, మొగిలీశ్వరి, శ్రీనివాస్, చదవాడ డెంటల్ కాలేజీ డాక్టర్ శిరిష, డాక్టర్ అక్షయ పాల్గొన్నారు.

మఠం భూముల రక్షణే ధ్యేయంగా పనిచేస్తా...

మఠం ఫిట్ పర్సన్ రమేష్ నాయుడుతో 'ప్రజాశక్తి ముఖాముఖి'

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

శ్రీస్వామి హథీరాంజీ మఠంకు దేశంలో ఏ మఠాలకు లేనన్ని భూములు ఉన్నాయి. ఎంతో చరిత్ర కలిగిన హథీరాంజీ మఠం భూములు దశాబ్దాలుగా కబ్జాలకు గురవుతున్నాయన్న విషయం బహిరంగ సత్యం. అయితే దీని వెనుక గత మఠాధిపతులు, రాజకీయనాయకులు ఉండడంతో కబ్జాకు గురవుతున్న భూములను రక్షించుకోవడానికి పెద్ద పోరాటాలు చేయాల్సివస్తోంది మఠం సిబ్బంది. అయితే హథీరాంజీ మఠం ఫిట్ పర్సన్‌గా భాధ్యతలు చెపట్టిన రమేష్‌నాయుడు మఠం భూముల రక్షణ అనేది ప్రధమవిధిగా స్వీకరిస్తూ మఠం భూముల అన్యాక్రాంతంపై గట్టి చర్యలు తీసుకోంటున్నారు. మఠం భూముల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, మఠం అభివృద్ధిపై ప్రజాశక్తితో రమేష్ నాయుడు ముఖాముఖి....

ప్రజాశక్తి: మఠం భూములు ఎంత ఉన్నాయి?

అధికారి: శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన భూములు దేశవ్యాప్తంగా దాదాపుగా 2 వేల ఎకరాలు ఉంటాయి. ఆయా రాష్ట్రాల్లో వాటిని లీజు ప్రతిపాదికన కేటాయిస్తాం. వాటి పరిరక్షణ చూసుకుంటుంన్నాము.

ప్రజాశక్తి: మఠం భూములు గతంలో కబ్జాకు గురి అయ్యాయి?

అధికారి: హథీరాంజీ మఠంకు చెందిన భూములు గతంలో నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసి అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు జరిగాయి. ఆ భూముల రక్షణ కోసం కోర్టును ఆశ్రయించాము. కోర్టులో వాజ్యాలు జరుగుతున్నాయి.

ప్రజాశక్తి: మఠం భూముల రక్షణకు చర్యలు చేపట్టారా?

అధికారి: హథీరాంజీ మఠం భూముల రక్షణ పటిష్ట పరిచేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులకు, ధార్మిక పరిషత్‌కు లేఖలు రాశాను. మఠం భూముల రక్షణకు అధునాధన టెక్నాలజీని వినియోగించి, ఎక్కడనుండైనా మఠం భూముల భౌగోళిక పరిస్థితిని పరిక్షించేలా చర్యలు చేపట్టాం. దీనికి సంబంధించిన నిధులు మంజూరు కాగానే మఠం భూములను ఆన్‌లైన్ ప్రకియ మొదటు పెడుతాం.

ప్రజాశక్తి: గత మహంతు అర్జున్ దాస్ అక్రమంగా లీజుకు భూములిచ్చారా?

అధికారి: గతంలో మహంతుగా విధులు నిర్వర్తించిన అర్జున్ దాస్ పలు అక్రమాలకు పాల్పడ్డారనే విషయంలో ధార్మిక పరిషత్ విచారణ చేపట్టి విధుల నుండి తప్పించింది. ఆ తరువాత నేను ఫిట్‌పర్సన్‌గా భాధ్యతలు తీసుకున్నాను. మఠం ఆర్థిక వ్యవస్థ మొత్తం చిన్నాభిన్నమైన నేపథ్యంలో వాటిని గాడిలో పెట్టడానికి పలు సంస్కరణ చర్యలు తీసుకున్నాను. ప్రస్తుతం సిబ్బంది జీతాలకు, ఫెన్షనర్లకు నెలనెలా జీతాలు ఇవ్వడానికే సరిపోవడం లేదు. ఇందుకు గాను దేవాదాయ కమీషనర్‌కు లేఖ రాసి జనరల్ నిధుల నుండి ఫెన్షనర్లకు నెలనెలా ఫించన్లు ఇవ్వడానికి అంతకు ముందున్న కార్పస్ ఫండ్ 80 లక్షలకు రెండు కోట్ల రూపాయలను కలిపాము. దీని ద్వారా వచ్చే వడ్డీతో ఫెన్షన్లు ఇవ్వనున్నాం.



ప్రజాశక్తి: మహంతు నియామకం ఎప్పుడు జరుగుతుంది?

అధికారి: గతంలో మహంతుగా పనిచేసిన అర్జున్ దాస్‌ను ధార్మిక పరిషత్ తొలగించడంతో రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు ధార్మిక పరిషత్ తాత్కాలిక మహంతుగా గతంలో జపాలి తీర్థంలో పనిచేసిన ఓం ప్రకాష్ దాస్‌ను నియమించింది. నేను పరిపాలన వ్యవహారాలు చూస్తున్న నేపథ్యంలో ఓం ప్రకాష్ దాస్ మఠం ఆధీనంలో నడిచే ధార్మిక కార్యక్రమాలు, ఆలయాల్లో పూజల నిర్వహణ వంటి అంశాలను యథావిధిగా కొనసాగడానికి ఆయన పనిచేస్తారు. ఈ మేరకు ఆయన భాధ్యతలు తీసుకున్నారు.


ఇంటర్వ్యూ

ప్రజాశక్తి: మఠం భూములను కొన్నవారి పరిస్థితి ఏంటి?

అధికారి: శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన స్థలాల్లో ఇప్పటికే చాలా మంది నివాసాలు ఏర్పాటు చేసుకొని స్థానికంగా సదురు స్థలానికి పన్నులు, విద్యుత్ బిల్లులు పొంది ఉన్నారు. తప్పుడు సర్వే నెంబర్లను వేసి రిజిస్ట్రేషన్లు చేసినట్టుగా గుర్తించాం. అంతోఇంతో కష్టించి కూడబెట్టిన ధనంతో సోంత ఇల్లు కొనుగోలు చేయ్యాలని భావించే వారు కోనుగోలు చేసే స్థలంకు సంబంధించిన వివరాలను తెలుసుకోవాలి. తక్కువ ధరకు వస్తున్నాయంటే ఆలోచించాల్సిన అవసరం ఉంది. మోసపోయామంటే మేము ఏమి చేయ్యలేము. ఏది ఏమైనా హథీరాంజీ మఠానికి చెందిన భూములను కాపాడుకుంటామని, కబ్జాకు గురి అయినా భూములు ఎవ్వరు కొనుగోలు చేసినా ఎప్పటికైనా అవి మఠం స్వాధీనం చేసుకొని తీరుతుంది. దేశ అత్తున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు హథీరాంజీ మఠం భూముల విషయంలో ఆందోళన వ్యక్తం చేసింది.

పల్స్ పోలియో విజయవంతం


చింతలపాలెంలో


శ్రీకాళహస్తిలో


బాలాయపల్లిలో


పాకాలలో


నారాయణవనంలో

ప్రజాశక్తి-యంత్రాంగం: పల్స్ పోలియో సందర్భంగా ఆదివారం జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రత్యేకించి శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలను వేశారు. పలు చోట్ల ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. రేణిగుంటలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, శ్రీకాళహస్తిలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, రామచంద్రాపురంలో డీఎల్‌డీవో సుశీలా దేవి పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందని అధికారులు తెలిపారు.


చిన్నగొట్టిగల్లులో


కేవీబీ పురంలో


రామచంద్రాపురంలో


రేణిగుంటలో


ఏర్పేడులో


నాయుడుపేటలో

జగనన్నా నీకు బూం..బూం..!

- సీఎంకు మద్యంతో అభిషేకం
- నిషేధించకుండా మాట తప్పాడంటూ జనసేన వినూత్న నిరసన


సీఎం చిత్రపటానికి మద్యంతో అభిషేకం చేస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు కానందుకు జనసేన నాయకులు ఆదివారం వినూత్న నిరసన చేపట్టారు. మాట తప్పినందుకు, మడమ తిప్పినందుకు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మద్యంతో అభిషేకం చేశారు. రామేశ్వరం వంతెన దగ్గర ఉన్న మద్యం షాప్ నుండి పెళ్లి మండపం మీదుగా నాలుగు మాడ వీధుల్లో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ కోట వినుత మాట్లాడుతూ మద్యపాన నిషేధం పేరుతో 2019 ఎన్నికల్లో మహిళల ఓట్లతో గెలిచిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మద్యం ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడుపుతున్న అసమర్థుడని విమర్శించారు. 2024ఎన్నికలకే పూర్తిగా మద్యం షాపులు తొలగించి ఓట్లకు వస్తానన్న జగన్ ఇప్పుడు ఏమి మొహం పెట్టుకుని ఓట్లకు వస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానిఫెస్టోలో ఉన్న అంశాలు బైబిల్ గాను, ఖురాన్ గాను, భగవద్గీతగా భావిస్తానని ప్రగల్భాలు పలికే జగన్ మద్యపాన నిషేధంలో హామీ నిలబెట్టుకోలేనిదానికి ఏమి సమాధానం చెప్తాడని ఎద్దేవా చేశారు. వీర మహిళలు లక్ష్మి, రాజ్యలక్ష్మి, కవిత, శారద, గాయత్రి, భాగ్యలక్ష్మి, శారద, అనురాధ, జయలలిత, బత్తెమ్మ, విజయ, రాధ తదితరులు పాల్గొన్నారు.

అశ్వగంధ చూర్ణంతో... ఆరోగ్యం

- సమావేశంలో పలువురు వక్తల వెల్లడి



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: అశ్వగంధ చూర్ణాన్ని మనిషి తీసుకోవడం వల్ల శరీరంలోని పలు రోగాలను దూరం చేసుకోవచ్చని ఆయుష్ మంత్రిత్వ శాఖ వైశ్య పరిశోధన అధికారి డాక్టర్ జితేంద్ర కుమార్ వెల్లడించారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళ యూనివర్సిటీలోని సావేరి సమావేశ మందిరంలో తిరుపతి స్థాపించబడిన సాయి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎస్ఆర్‌కేఈ) ఫౌండర్ అధ్యక్షులు డాక్టర్ డి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నేషనల్ మెడిసినల్ ప్లాంట్స్ బోర్డ్ మినిస్టర్ ఆఫ్ ఆయుష్ గవర్నమెంట్ ఆఫ్ భారత్ ఏపీ మెడిసినల్ అండ్ ఆరోమేటిక్ ప్లాంట్స్ బోర్డు సహాయ సహకారాలతో అశ్వగంధ చూర్ణం తీసుకోవడం వల్ల మనిషికి కలిగే లాభాలు అలాగే అశ్వగంధ మొక్కను రైతులు ఏ విధంగా సేంద్రీయ పద్ధతిలో సాగు చేయడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయుష్ మంత్రిత్వ శాఖ వైశ్య పరిశోధన అధికారి డాక్టర్ జితేంద్ర కుమార్, ఎస్ వి ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్ ఎస్వీ యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ వైవిరామిరెడ్డి సాయి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జితేంద్ర కుమార్ మాట్లాడుతూ అశ్వగంధం స్వర్ణం మనిషి తీసుకోవడం వలన ఒత్తిడిని ఎదుర్కోన వచ్చునని నిద్ర బాగా పడుతుందని బ్లడ్ షుగర్ కొవ్వు స్థాయిలను తగ్గిస్తుందన్నారు. అలాగే కండరాల బలం ఓర్పు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని స్రి పురుషులలో సంతానోత్పత్తిని మెరుగుపరచడానికి ఎంతో తోడ్పడుతుందన్నారు.అనంతరం పరివర్తన సేవా సంస్థ ప్రతినిధి పి అమర్నాథ్ అశ్వగంధ చూర్ణం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాహకులు గంగాధరం జతాస్ హెర్బల్ లిమిటెడ్డాక్టర్ జే ఎల్ ఎన్ శాస్త్రి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మహిళ వ్యవసాయ రైతులు సేంద్రియ వ్యవసాయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద ఉన్న పైపులు ఫ్యాక్టరీకి ఎదురుగా పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఆదివారం ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెం దాడు. సమాచారం అందుకున్న ఏర్పేడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా హాస్పిట ల్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జిలాని తెలిపారు.

బైక్‌కి నిప్పంటించిన దుండగులు

ప్రజాశక్తి-ఏర్పేడు: మండల కేంద్రంలో ఓ బైక్‌కి దుండగులు నిప్పంచిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. ఏర్పేడుకు చెందిన శ్రీనుకు చెందిన ఎన్‌ఫీల్డ్ బైక్‌కి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. బైక్ పూర్తిగా కలిపోయింది. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం స్థావరాలపై పోలీసుల దాడి


ప్రజాశక్తి-బాలాయపల్లి: కోడి పందెం స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. మండలంలోని వాక్యం గ్రామం లో రహస్యంగా ఆడుతున్న స్థావరంపై దాడి చేసి రెండు కోళ్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహబూబ్ సుభాన్ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-గూడూరుటౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రెడ్డిగుంట వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చెంచయ్య వద్ద 12సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాగా అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కారును ఢీకొన్న టిప్పర్

- ఒకరు దుర్మరణం



ప్రజాశక్తి-పెళ్లకూరు: కారును టిప్పర్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి పెళ్లకూరు పెట్రోల్ బంకు సమీపంలో చోటుచేసుకుంది. నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న కారును గ్రావెల్ లోడ్‌తో వెళుతున్న టిప్పర్ ఢీకొంది. కారులో ఉన్న నలుగురు తీవ్ర గాయాలపాలైయ్యారు. అక్కడి స్థానికులు వారికి 108లో నాయుడుపేట ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో కారు డ్రైవర్ కిషోర్(38) మృతి చెందారు. ఈయన కావలి పట్టణానికి చెందిన వాడిగా గుర్తించారు. ఎస్ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పంచాయతీలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ మేకలత్తూరు లలిత కరుణాకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం గ్రామపంచాయతీలో దోమల నివారణకు ఆమె ఫాగింగ్ చేయించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు పారిశుధ్య కార్మికులతో ప్రతి వీధిలోనూ ఫాగింగ్ పనులు చేపట్టారు.

టీడీపీ విజయానికి కృషి చేయండి: నెలవల

ప్రజాశక్తి-నాయుడుపేట: టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెలవల విజయశ్రీ కోరారు. ఆదివారం స్థానిక శ్రీనివాస కళ్యాణమండపంలో టీడీపీ, జనసేన శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సుళ్ళూరుపేట ఇన్‌ఛార్జ్ ప్రవీణ్‌కుమార్, నెలవల సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివర్తి నానిని గెలిపిద్దాం..

- ఆత్మీయ సమ్మేళనంలో చంద్రగిరి యువత పిలుపు

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): టీడీపీ, జనసేన సైనికులు చేయి చేయి కలిపి పులివర్తి నానిని గెలిపిద్దాం అంటూ ఆత్మీయ సమావేశంలో యువత పిలుపునిచ్చారు. ఆదివారం చంద్రగిరి తెలుగు యువత మండల అధ్యక్షులు రాజులుగారి వినోద్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన యువత ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి టీడీపీ చంద్రగిరి ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ధనంజయరెడ్డి, గోపి, ప్రవీణ్‌రాయల్, గురుమూర్తిరెడ్డి, నవీన్, గురునాథ్, కిషోర్, శ్రీనులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తాను పై పోర్షన్‌లోకి వెళ్లేందుకు దారి వదలమన్నందుకు ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. కొర్లగుంట మారుతినగర్‌లోని ఓ ఇంటి రెండో అంతస్తులో రామ్‌లాల్ చౌపాల్ అనే వ్యక్తి నివసిస్తున్నాడు. అదే ఇంటిలోని మొదటి అంతస్తులు సంతోష్ కుటుంబం నివసిస్తోంది. గత గురువారం వ్యక్తిగత పనుల మీద బయటకు వెళ్లిన రామ్లాల్ చౌపాల్ తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో రెండో అంతస్తూకి ఎక్కే మెట్లుకు అడ్డంగా కూర్చున్నారు. పై అంతస్తు వెళ్లడానికి అడ్డుగా ఉన్న వారిని దారి ఇవ్వమని అడిగిన రామ్ లాల్, సంతోష్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న సంతోష్, స్నేహితులు రామ్‌లాల్‌పై దాడి చేశారు. గాయాలు పాలైన అతన్ని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడు రామ్‌లాల్ ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతోష్, జగన్, ఆఫ్రిదిలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు టిడ్కో ఇళ్లు కట్టిస్తాం...

జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభంలో నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని నిరుపేదలకు మంగళం ప్రాంతంలోని చెన్నాయిగుంట గ్రామ దాఖల సర్వే నెంబరు 195/2, 195/4లోని సర్వే ట్రైనింగ్ అకాడమీ కి చెందిన భూమిలో టిడ్కో ఇళ్లు కట్టి ఇస్తామని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాని హామీ ఇచ్చారు. ఆదివారం మంగళం పరిధిలో తిరుమల గ్రామపంచాయతీలో జనసేన పార్టీ అర్బన్ మండల కార్యాలయాన్ని జనసేన పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇంచార్జి దేవర మనోహర్ తో కలసి పులివర్తి నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కరోనా సమయంలో ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వచ్చిన తమను కరోనా ఆంక్షలతో అడ్డుకోవడం జరిగిందని, ఇది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

టైక్వాండో విద్యార్థులకు బెల్టులు ప్రదానం



ప్రజాశక్తి-తిరుపతిటౌన్: శ్రీదేవి కాంప్లెక్స్‌లోని టైక్వాండో ట్రైనింగ్ సెంటర్‌లో వివిధ విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఆదివారం ట్రైనింగ్ సెంటర్లో జరిగిన కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకురాలు గీతా శిక్షకులు గోపినాయుడు, సురేష్ పర్యవేక్షణలో విద్యార్థులు చేసిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రేడింగ్ బెల్ట్‌లతో పాటు సర్టిఫికెట్స్ అందజేశారు. నిర్వాహకురాలు గీత మాట్లాడుతూ పిల్లలందరూ కూడా మరింత శిక్షణ పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, టైక్వాండో శిక్షణ వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకులు భవ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుర్రంపై సాహసయాత్ర



ప్రజాశక్తి-క్యాంపస్: డైరెక్టరేట్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో కల్నల్ ప్రకాష్ ఓసీ, 2(ఎ)ఆర్, వి రెజిట్, ఎన్సిసి గ్రూప్ తిరుపతి ద్వారా గుర్రంపై మౌంటెడ్ ఎక్స్‌పెడిషన్ నిర్వహించారు. ఫిబ్రవరి 25 నుంచి 02వ తేదీ వరకుఏ 7 రోజుల పాటు సాగిన ఈ యాత్రను ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ సీఎండీ వీఎమ్ రెడ్డి ఫ్లాగ్ ఆఫ్ చేశారు. 30మంది క్యాడెట్‌లు, 08మంది ఇండియన్ ఆర్మీ సిబ్బంది, 10మంది పౌర సిబ్బంది పాల్గొన్నారు. ఈ యాత్ర సమయంలో దాదాపు 210కిలోమీటర్ల దూరం గుర్రంపై ప్రయాణించారు. ఎన్సిసి గ్రూప్ తిరుపతి కమ్యూనిటీ ఔట్రీచ్ చొరవలో భాగంగా గుర్రంపై సవారీ కాకుండా, అనేక సామాజిక సేవ, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యకలాపాలు చేశారు. ఈ లక్ష్యాల సాధనలో శ్రీకాళహస్తి మండలం తొండమానాపురంలో పశు వైద్య శిబిరం, పాలమంగళంలో చెట్ల పెంపకం కార్యక్రమం, అరణియార్ జలాశయం వద్ద జలవనరుల ప్రక్షాళన పునీత్ సాగర్ అభియాన్, 'అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరం' కార్యక్రమంలో భాగంగా మినుముల ఔచిత్యంపై ర్యాలీ, పుత్తూరులో రక్తదాన శిబిరాన్ని చేపట్టారు. ఈ ప్రాంతంలోని ఈక్వెస్ట్రియన్ ఫీల్డ్‌లో అన్ ట్యాప్డ్ టాలెంట్ పూల్ అపారమైనది, ఇది ఆర్డిసిలో 2ఆర్, వి క్యాడెట్‌ల పనితీరు ద్వారా బాగా నిరూపించబడింది. ఈ ప్రాంతంలోని మారుమూల ప్రాంతాలలో క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు, యువత ఈక్వెస్ట్రియన్ క్రీడను ఆసక్తిగా తీసుకునేలా ప్రోత్సహించేందుకు పుత్తూరులో గుర్రపు ప్రదర్శన నిర్వహించారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి: సిఐ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని సీఐ శ్రీహరి అన్నారు. ఆదివారం బీఎన్ కండ్రిగ పోలీస్‌స్టేషన్‌లో పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కవ్వింపు చర్యలకు పాల్పడి దాడులు, ప్రతిదాడులకు పాల్పడితే కఠిన కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట నరసింహం తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-క్యాంపస్: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు ఉపయుక్తంగా నిలుస్తున్నాయని తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తుమ్మలగుంటలో చంద్రగిరి మండలం తొండవాడకు చెందిన బాధితురాలు సుజాతమ్మకు వచ్చిన రూ.70వేలు చెక్కును ఆమె కుమార్తె మౌనికకు అందజేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: రిజిస్ట్రార్



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసం అని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఎస్వీయూలో విద్యార్థులకు వార్షిక క్రీడలు జరుగుతున్నవి ఇందులో భాగంగా ఆదివారం విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రాధాగోవింద్ త్రిపాఠి టాస్ వేసి, విద్యార్థులతో మాట్లాడుతూ వేద విద్యతో పాటు ఆధునిక విద్యలలోనూ, అలాగేఆధునిక క్రీడలలోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తద్వారా శారీరిక దృఢత్వం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ రాజేష్‌కుమార్, మేష్‌భట్ పాల్గొన్నారు.

కంచె తగలబెట్టారని ఫిర్యాదు

ప్రజాశక్తి-బాలాయపల్లి: దౌర్జన్యంగా వ్యవసాయ పొలానికి సంబంధించిన కంచెను తగలబెట్టిన సంఘటన మండలములోని కడగుంటలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ విషయంపై బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'సుధీర్‌రెడ్డిని గెలిపించండి'

ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని చియ్యవరం, చేమూరు గ్రామాలలో 'ఇంటింటికి మీ బొజ్జల' కార్యక్రమంలో భాగంగా టీడీపీ శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషిత రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని, సుధీర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని ప్రతి ఇంటికి వెళ్లి అభ్యర్థించారు.

'సూపర్ సిక్స్'తో పేదల జీవితాల్లో వెలుగు: భాను

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టి సూపర్ సిక్స్ పథకాల ద్వారా టీడీపీ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని టీడీపీ నగరి ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ఈలాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తనకు అవకాశం ఇచ్చి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-రేణిగుంట: పట్టణంలో టీడీపీ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ శ్రీకాళహస్తి ఇన్‌ఛర్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ముందుగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆ తరువాత పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్నా, స్వామినాయుడు, చిన్నారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, కన్నన్‌రెడ్డి, రవి, జగదీష్, పుష్పనాధన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలో ఏర్పాటౌవుతున్న మహిళా మార్టు పనులను ఆదివారం మున్సిపల్ కమిషనర్ కెవిఎంఎన్ రెడ్డి, ఛైర్మన్ హరిలు పరిశీలించారు. అదేవిధంగా మున్సిపల్ పార్కులో శానిటేషన్, క్లీనింగ్ వర్క్‌లు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం చెత్త సేకరణకు 13ఆటోలు మంజూరు చేసిందని, వాటిని సోమవారం మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: పాకాల మండలం ఇ-పాలగుట్టపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం తుడా ఛైర్మన్ మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. కాగా దీర్ఘ కాలం నుంచి ఉన్న సమస్యను తీర్చారని గ్రామస్తులు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ ప్రద్మజారెడ్డి, సర్పంచ్ సిద్దారెడ్డి, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ విక్రమ్‌రెడ్డి, నాయకులు నరేష్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, లింగయ్య, రఘుపతి, రహీం తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణ పరిధిలోని జానకి రాంపేటలో కొలువై ఉన్న పోలేరమ్మ అమ్మవారి ఆలయంవద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని విఘ్నేశ్వరపురంకి చెం దిన పలువురు ఆదివారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ కండువా కప్పి పా ర్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

శివరాత్రి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని చిందేపల్లిలో వెలసిన సిద్ధేశ్వం స్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆహ్వానపత్రికలను ధర్మకర్తలు ఆదివారం ఆవిష్కరించారు. గిరిధర్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, కమిటి సభ్యులు మాట్లాడుతూ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.

ఐక్యంగా ఉందాం..

ప్రజాశక్తి-గూడూరుటౌన్: ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకుందామని ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సంఘ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటరామరాజు, వాసుదేవరావు, కామేశ్వర ప్రసాద్, శివరామ క్రిష్ణ, శ్రావణ్‌కుమార్, గురుప్రసాద్ రావు, నరేష్, బాలాజీ, పవన్‌కుమార్, హరిప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఏర్పేడు: గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికలు, కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చకులు పవన్‌కుమార్ శర్మ, ఛైర్మన్ నరసింహయాదవ్, సర్పంచ్ సుబ్రహ్మణ్యంయాదవ్, ఈవో రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రేణిగుంట: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, హరినాథ్, ముత్యాలరెడ్డి, నిర్మల, మురళి, చంద్రశేఖర్, బ్రహ్మయ్య, వెంకటరత్నం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్: పుత్తూరు గిరిజన సంక్షేమ గురు కుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతిలోని పాఠశాలలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: క్రమశిక్షణతో కూడుకున్న విద్యను విద్యార్థులు అభ్యసించాలని టైక్వాండో ప్రెసిడెంట్ ధనుంజయులు అన్నారు. ఆదివారం స్థానిక విజ్ఞాన జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఓపెనింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, పాఠశాల సీఈవో రామ్మోహన్, వాసుదేవాచారి, శ్రీనివాసులు, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందచేత

ప్రజాశక్తి-గూడూరుటౌన్: మండలంలోని చెన్నూరుకు చెందిన గీతకు రూ.1.50లక్షల సీఎం సహాయ నిధి మంజూరైంది. చెక్కును ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ బాధితురాలికి అంద చేశారు. కార్యక్రమంలో విజయకుమార్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజీవ్‌రాం రెడ్డి పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మోసే శ్రీపాద కూలీలకు ఆదివారం నాయుడుపేటకు చెందిన సురేష్ అండ్ రమేష్ బ్రదర్స్ 300టీ షర్టులు, 300 పంచెలు వితరణగా ఇచ్చారు. ప్రథమ చికిత్స కేంద్రానికి అవసరమైన మందులు అందజేశారు. ఈవో నాగేశ్వరరావు వీటిని స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపి ప్రత్యేక దర్శనం కల్పించారు.

మహిళా అభ్యున్నతికి కృషి చేస్తా: మోహ్సినా బేగం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో మహిళల అభ్యున్నతికి కృషి చేస్తానని తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన మోహ్సినా బేగం అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై, స్థానిక మహిళ నాయకత్వం సహకారంతో పోరాడుతానని మోహ్సినా బేగం స్పష్టం చేశారు. కార్యక్రమంలో సుభాషిణి, భాను, జభినా బేగం, కుమారి పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా వార్షికోత్సవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో ఆదివారం 7వ క్రీడా వార్షికోత్సవం జరిగింది. ఇందులో భాగంగా హెచ్ఎం కిరణ్‌కుమార్, మేనేజర్ దైవజ్ఞచారి క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులు వివిధ రకాల విన్యాసాలతో అలరించారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందెం, షార్ట్ పుట్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు కృష్ణ కిషోర్, వాసంతి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి: ఎస్‌టీయూ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ప్రభుత్వ వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 30శాతం ఐర్‌ను ప్రకటించాలని ఎస్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 6న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వారు ఆదివారం స్థానిక ఎస్టియు భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. అదేవిధంగా మరోచోట తిరుపతి రూరల్‌లోని డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన నోబుల్ టీచర్ అసోసియేషన్ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఐఆర్‌పై ప్రభుత్వంపై నిర్ణయం తీసుకొని 30శాతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

- టీడీపీ గెలుపునకు కృషి చేస్తా..: సర్పంచ్ చిరంజీవిరెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని చిట్టత్తూరు కాళేపల్లి వైసీపీ సర్పంచ్ చిరంజీవిరెడ్డి ఆదివారం టీడీపీలో పులివర్తి నాని సమక్షంలో చేశారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలు, గ్రామ సమస్యలు పట్టించుకోకపోవడంతో ఆ పార్టీని వీడామన్నారు. ఏళ్ల తరబడి వేధిస్తున్న రాయలచెరువు సమస్య పరిష్కారించ లేదని వాపోయారు. చెరువు కలుషితమై గ్రామస్తులు రోగాలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ చంద్రగిరి ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని మాటాడుతూ వైసీపీ పతనం ఆరంభమైందన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO. 154 / 2023

చిగిలి శ్రీదేవి ...వాది
Vs
వేపకోమ్మ సాయిపద్మశేఖర్ ...ప్రతివాది

టు,
వేపకోమ్మ సాయిపద్మ శేఖర్
W/o లేట్ మాధవరావు, వయస్సు 65 సం॥లు
బిజినెల్ మరియు వ్యవసాయం, దేవర వేమూరు గ్రామం, సైదాపురం మండలం, తిరుపతి జిల్లా.
పిన్‌కోడ్-524409.

దావా సమను

పైన తెలుపబడిన కోర్టు నందు పై వాది ఈ దావాలో మీ చిన్నాన్న అయిన లేట్ వేపకోమ్మా సాయి ప్రసాద్ రావు చెల్లించవలసిన బాకీగానూ దావా దాఖలు వేసియున్నారు. ఆ దావా తేది 27.03.2024 వాయిదా వేసి ఉన్నది. ఆరోజు 10:30 నిమిషాలకు పై కోర్టు నందు మీరు ప్రత్యక్షంగానీ, మీ తరపున న్యాయవాది ద్వారా గానీ, హాజరు కావల్సివుంది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు. ఇది కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయడమైనది.

ఇట్లు,
వాది తరుపున న్యాయవాది,
కందనూరు వెంకట కృష్ణయ్య
అడ్వకేట్, గూడూరు.
సెల్: 9440113977

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO.282/2023,
O.S.NO. 154 / 2023

చిగిలి శ్రీదేవి ...పిటిషినర్/వాది
Vs
వేపకోమ్మ సాయి పద్మశేఖర్...రెస్పాడెంట్/ ప్రతివాది

టు,
వేపకోమ్మ సాయిపద్మ శేఖర్
W/o లేట్ మాధవరావు, వయస్సు 65 సం॥లు
బిజినెల్ మరియు వ్యవసాయం, దేవర వేమూరు గ్రామం, సైదాపురం మండలం, తిరుపతి జిల్లా.
పిన్‌కోడ్-524409.

నోటీస్ నిమిత్తం

పైన తెలుపబడిన కోర్టు నందు మీ పైన తనకు రావాల్సిన బాకీ డబ్బుల కోసం దావా వేసియున్నారు. ఈ దావాలో మీ చిన్నాన్న అయిన లేట్ వేపకోమ్మా సాయి ప్రసాద్ రావు చెందిన షెడ్యూలు దాఖల ఆస్తిని అటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంట్ కోరుతూ పిటీషన్ దాఖలు చేసియున్నారు. ఆ పిటిషిన్ తేది 27.03.2024 వాయిదా వేసి వున్నది. కావున ఆ రోజు ఉదయం 10:30 నిమిషాలకు పై కోర్టు నందు మీరు ప్రత్యక్షంగా గానీ, మీ తరపున న్యాయవాది ద్వారా గానీ, హాజరు కావల్సివుంది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు. ఇది కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయడమైనది.

ఇట్లు,
వాది తరుపున న్యాయవాది,
కందనూరు వెంకట కృష్ణయ్య
అడ్వకేట్, గూడూరు.
సెల్: 9440113977